

రాజకీయ కక్షతో దుకాణం కూల్చివేత
ఎన్నికల్లో వ్యతిరేకంగా పని చేశారన్న రాజకీయ కక్ష సాధింపుతో చిల్లరకొట్టు దుకాణం గదులను జేసీబీ సాయంతో నేలమట్టం చేశారు. -8లో



ఏకశిలానగరి బ్రహ్మోత్సవాల తేదీ ఖరారు
ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 5 నుంచి 15 వరకు జరగనున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.180
రెండోరకం	రూ.90	రూ.146

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 72 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఎస్సీ కులగణనపై 23 వరకు అభ్యంతరాల స్వీకరణ

రాయచోటి జగదాంబసెంటర్: ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును ఈ నెల 23వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు అన్నమయ్య జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎన్.జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు.. విధి విధానాలు తెలుపుతూ ప్రత్యేక జీవోను జారీ చేసిందన్నారు. ఈ మేరకు జనవరి 23వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

రేపు హాకీ సబ్ జూనియర్ బాలికల జిల్లా జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం బీటీ కాలేజీ హాకీ మైదానంలో ఈనెల 23న ఉదయం 9 గంటలకు హాకీ సబ్ జూనియర్ జట్టు ఎంపిక జరుగుతుందని అన్నమయ్య హాకీ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.ప్రసాద్, కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి పి.ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 1-1-2009 తేదీ తరువాత పుట్టినవారు అయి ఉండాలన్నారు. బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ తప్పకుండా తీసుకురావాలన్నారు. ఎంపికైన టీం ఆర్డీటీ అనంతపురంలో ఈనెల 27వతేదీ నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9494743425, 9441152481లో సంప్రదించాలని కోరారు.

23న ఉద్యోగమేళా

రాయచోటి అర్బన్: రాయచోటి పట్టణంలో ఈనెల 23న ఉద్యోగమేళాను నిర్వహించనున్నట్లు రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాలో హ్యుందాయ్, మూబిస్, ఫ్లిప్‌కార్డు, అపోలో ఫార్మసీ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు https//naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9550104260, 9177143181, 8897776368 ఫోన్ నంబర్లలో సంప్రదించాని కోరారు.

సంబేపల్లె పీహెచ్‌సీ తనిఖీ



పీఎస్‌కాలనీలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

సంబేపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి లక్ష్మన్ నాయక్, జాయింట్ డైరెక్టర్ త్యాగరాజ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాలలో వ్యాపిస్తున్న మలేరియా, డెంగ్యూ జ్వరాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు గ్రామాలలో వ్యాధులపై ఆరా తీయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే పాటించేలా చూడాలని సూచించారు. అనంతరం ప్రకాశ్‌నగర్ కాలనీలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. సంబేపల్లె వైద్యాధికారి మధుసూదన్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్,సూపర్‌వైజర్ సదాశివారెడ్డి, సబ్‌యూనిట్ అధికారులు ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, నిత్యపూజయ్య, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు

కడప అర్బన్: నేరం చేసిన వారికి శిక్ష.. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డీజీపీ సి.హెచ్.ద్వారకా తిరుమలరావు పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కడప నగరంలోని పోలీస్ కార్యాలయ ఆవరణలో 'పోలీస్ పెన్నార్ కాన్ఫరెన్స్' హాల్‌లో కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్, జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడుతో కలిసి కడప, అన్నమయ్య జిల్లాల పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నిబద్ధతతో నేరాల కట్టడికి కృషి చేయాలన్నారు. సమష్టి కృషితో ప్రజలకు మరింత మెరుగైన పోలీసింగ్ అందించాలని ఆకాంక్షించారు. గతంలో జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించిన నేపథ్యంలో జిల్లాతో తనకు ఉన్న అనుబంధాన్ని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డే, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

కాల్ చేసి.. ఖాళీ చేసి..

వారంతా దొంగలు.. అలాగని వారి దగ్గర కత్తులేం ఉండవు.. ఖాళీగా ఉన్న ఇళ్ల వారి లక్ష్యమే కాదు.. తాళాలు పగలగొట్టడం ఎలా అనే ఆలోచనే వారి దరి చేరదు.. రాత్రిపూటే చోరీలు చేయాలన్న నియమం వారికి అస్సలు వర్తించదు.. పట్ట పగలే 'కాల్' చేసి మరీ వస్తారు.. అవును.. స్మార్ట్ ఫోనే వారి ఆయుధం.. కాల్ చేయడమే వారి నియమం.. మాటల్లో దింపి బురిడీ కొట్టిస్తారు....పాస్‌వర్డులు తెంచుకుని మరీ ఖాతాల్లోకి దూసుకొస్తారు. నిమిషాల్లో ఖాతా ఖాళీ చేస్తారు. వారు 'స్మార్ట్ దొంగలు' జిల్లాలో సైబర్ నేరాలు ఎక్కువైన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

నిమిషాల్లో రెండు లక్షలు మాయం



ఇతని పేరు ఎస్ బీ సంతోష్. చిట్వేలిలో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. రెండు నెలల క్రితం ఓ ఫోన్ కాల్ వచ్చింది. 'కంగ్రాట్యులేషన్.. స్టేట్‌బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీరు యాభైవేల రూపాయలు గెలుచుకొన్నారు' అని చెప్పారు. మీ బ్యాంకు సంబంధించిన వివరాలు చెబితే డబ్బు పంపిస్తామని చెప్పారు. సంతోష్.. తన ఏటీఎం సీవీవీతో పాటు ఎక్స్‌పైర్ నెల, సంవత్సరం వంటి వివరాలు చకచకా చెప్పాడు. అంతే నిమిషాల్లోనే సెల్లుకు మెసేజ్ వచ్చింది.. డబ్బులు క్రెడిట్ అయినట్లు కాదు.... అకౌంట్‌లో ఉన్న రెండు లక్షల రూపాయలు ఖాళీ అయినట్లు. వెంటనే స్థానిక బ్యాంక్‌కెళ్లి విచారించాడు. వారు తమకు తెలియదన్నారు. చేసేది లేక ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఇప్పటివరకు డబ్బులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- ఆశ చూపిస్తూ సైబర్ జాలంలో.. జనం విలవిల
- సరికొత్త పంథాలో నేరగాళ్ల దోపిడీ
- బ్యాంక్ ఖాతాలు ఖాళీ చేస్తున్నారు
- లబోదిబోమంటున్న ప్రజలు
- రోజు రోజుకు పెరుగుతున్న బాధితులు
- అప్రమత్తంగా ఉండటమే అవసరం




ఓబులవారిపల్లె: సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు. రోజుకో ఆలోచనతో ప్రజల్ని బురిడీ కొట్టిస్తున్నారు. ఓ సారి పోలీసులమని, మరోసారి అధికారులమని కొత్త కొత్త దారుల్లో వచ్చి ఖాతాలను లూటీ చేస్తున్నారు. ఈకేవైసీల పేరున లింకులు పంపి .. నయానో భయానో బెదిరింపులకు పాల్పడి మోసాలు చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లను అడ్డుకోవాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండడమే తక్షణ కర్తవ్యమని అధికారులు సూచిస్తున్నారు. గత ఆర్నెళ్లలో రైల్వేకోడూరు నియోజకవర్గంలో 12, రాజంపేట నియోజకవర్గంలో 17 కేసులు నమోదైనట్లు సమాచారం. ఇక ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల సంఖ్య వందల్లోనే ఉన్నాయి.



కొత్త తరహాలో మోసాలు

- ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌ను అత్యధికంగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా గతంలో మైదానంలో ఆటలు ఆడే యువత నేడు సెల్‌ఫోన్‌లోనే కాలాన్ని గడిపేస్తున్నారు. సైబర్ చోరులకు ఇప్పుడిదే ఆయుధమైంది. వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి వాటిని హ్యాక్ చేస్తున్నారు. ఏదో ఒక గేమ్ లింక్ పంపి ..సదరు లింకులను నొక్కేలా చేస్తున్నారు. అంతేనా.. సదరు వ్యక్తి సమాచారం తన వద్ద ఉందని, తాము పోలీసు ఉన్నతాధికారులమని డబ్బులు చెల్లించాలని.. లేకుంటే కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. సెల్‌ఫోన్‌లో ఏదో ఒక్కతప్పు చేసిన వారు భయపడి సైబర్ నేరగాళ్లకు డబ్బులు చెల్లించి మోసపోతున్నారు.
- ప్రజలు ఎక్కువగా ఆన్‌లైన్‌లో వివిధ వెబ్‌సైట్‌లలో తమ ఫొటోలతో సహా బయోడేటాను నమోదు చేసుకుంటుంటారు. మోసగాళ్లు ఈ వివరాలను సేకరించి.. వివాహాలకు సంబంధించిన వెబ్‌సైట్‌లలో వధువు తల్లిదండ్రులమని చెప్పి పరిచయాలు పెంచుకుంటున్నారు. ఏదో ఒక అవసరమని చెప్పి అందినకాడికి దోచుకుంటున్న ఘటనలూ వెలుగు చూస్తున్నాయి.
- టెక్నాలజీ అభివృద్ధి చెందిన ప్రస్తుత రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా ప్రస్తుతం ఆన్‌లైన్‌ల ద్వారా నిత్యావసర సరుకులు, దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. మాధ్యమాల్లో వారు చూపిస్తున్న వివిధ రకాల ఆఫర్లలో కొనుగోలు చేసేందుకు క్రెడిట్, డెబిట్ కార్డులు ద్వారా నగదును చెలిస్తున్నారు. దీన్నే సైబర్ నేరగాళ్ల అవకాశంగా, అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిమిషాల్లో పాస్‌వర్డ్‌లు హ్యాక్ చేస్తూ బ్యాంక్ అకౌంట్ నుంచి నగదును దర్జాగా దోచుకొంటున్నారు.



- అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకుంటున్న వారూ కొందరున్నారు. కోటిరూపాయలు కారు తగిలిందని, సిమ్ కార్డు పోటీలలో పదిలక్షల రూపాయలు గెలుపొందినట్లు ఈమెయిల్‌కు,వాట్సాప్‌లకు వచ్చిన మెసేజ్‌లకు స్పందిస్తూ మోసపోతున్న ఘటనలు కోకొల్లలు.

ఎక్కడి నుంచి అయినా ఫిర్యాదు చేయవచ్చు

గతంలో సైబర్ నేరస్తుల వలలో చిక్కిన వారు ఫిర్యాదు చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా నేరాలు ఎక్కువ అవుతుండటంతో బాధితులు ఫిర్యాదు చేసే మార్గాన్ని ప్రభుత్వం సులభతరం చేసింది. హెల్ప్‌లైన్ నెంబర్ కేటాయించి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. బాధితులు సాధ్యమైన త్వరగా స్పందించి ఫిర్యాదు చేసినట్లయితే పోగొట్టుకొన్న సొమ్ము తిరిగి తెప్పించే అవకాశం ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు.

ఫిర్యాదు చేసేందుకు...
సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్: **1930**
ఆర్థిక నేరాలకు సంబంధించి: **155260**
వెబ్‌సైట్: సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్

అధికారులమని యాభైవేలు స్వాహా చేశారు



జిల్లా ఎస్పీని మాట్లాడుతున్నా.. నీ మొబైల్ ఫోన్ హ్యాక్ చేశాం... నీపై కేసు నమోదు చేస్తున్నాం అని బెదిరించారు. కాసేపు నాకు చెమటలు పట్టాయి. నేనేమీ నేరం చేయలేదు నా పై కేసు ఎందుకు అని భయపడిపోయాను. ముప్పై వేల రూపాయలు వేయాలని లేకుంటే కేసు పెడతామని బెదిరించారు. ఎందుకు ఈ సమస్యలు అని చెప్పి వెంటనే వారు చెప్పిన అకౌంట్‌కు డబ్బులేశాను. ఈ విషయం ఎక్కడ చెప్పుకోలేదు.
– షేక్ జాహీర్ బాషా, ఓబులవారిపల్లె

నిర్భయంగా ఫిర్యాదు చేయండి



సైబర్ నేరాలపై భయపడకుండా నిర్భయంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. నేరగాళ్ల వలలో చిక్కకుండా అప్రమత్తంగా ఉండాలి. బ్యాంక్ లింక్‌లు పేరులో వచ్చే కాల్స్‌కు ఓటీపీలు చెప్పవద్దు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా మోసపోతున్నారు. ఫోన్ వినియోగం ఎక్కువ కావడంతో సైబర్ నేరాల సంఖ్యకూడా పెరుగుతోంది. మోసపోయామని తెలిసిన వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయండి.
– వెంకటేశ్వరులు, రూరల్ సీఐ రైల్వేకోడూరు

ప్రజల ప్రాణాలు పట్టవా!

- నిధులున్నా రహదారి గుంతలు పూడ్చలేని స్థితిలో కూటమి నాయకులు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల ధ్వజం

రైల్వేకోడూరు అర్బన్: కడప-రేణిగుంట జాతీయ రహదారిపై అడుగడుగునా గుంతలున్నా.. మరమ్మతులు చేయకుండా కూటమి సర్కార్ ప్రజల ప్రాణాలను హరిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి లోపు రోడ్లు బాగు చేస్తామని డప్పు కొట్టి మరీ చెప్పిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ .. ప్రతి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, కూటమి నాయకులు 48 కోట్లు నిధులు మంజూరు అయినా పనులు చేయలేని దుస్థితిలో ఉన్నారని విమర్శించారు. ఇంతవరకు వేచి చూశామని వారంరోజులలో రహదారి సరి చేయకపోతే జాతీయ రహదారిపై ప్రజా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గతంలో ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో 2200 కోట్లతో హైవే మంజూరు చేయించినా ఆ పనులూ చేసుకోలేక ఉన్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పేద ప్రజలకు చేసిందేమి లేదన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

పక్కాగా ఎంఎస్‌ఎంఈల సర్వే

కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: జిల్లాలో ఎంఎస్‌ఎంఈల సర్వేను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఎంఎస్‌ఎంఈల సర్వే అంశంపై జిల్లా పరిశ్రమలశాఖ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసేందుకు పరిశ్రమల శాఖ అధికారులు, కమర్షియల్ టాక్స్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలాల వారీగా ప్రగతిని కలెక్టర్ సమీక్షించారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కృష్ణారావు, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

భూ పరిహారం ప్రక్రియ వేగవంతం: జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి నిర్వాసితులకు భూ పరిహారం పంపిణీ వేగంగా పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్‌కు వివరించారు. మంగళవారం విజయవాడ సచివాలయం నుంచి రాష్ట్రంలో జాతీయ రహదారుల భూసేకరణ, అటవీ భూముల కేటాయింపు, కోర్టు కేసుల అంశంలో జిల్లాల వారీగా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌లు పాల్గొన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల ప్రగతిని సీఎస్‌కు కలెక్టర్ వివరించారు.

బాబు దావోస్ యాత్ర డ్రామా

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

నందలూరు: బాబు దావోస్ యాత్ర అంతా డ్రామా అని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన అంతా భజన, ప్రచార ఆర్భాటాలకే పరిమితమని విమర్శించారు. 2014-19 మధ్యలో కూడా ఇలాగే దావోస్ వెళ్లారని, కానీ రాష్ట్రానికి తీసుకువచ్చిన పెట్టుబడులు శూన్యమని ఆయన గుర్తు చేశారు. మీడియాకు భారీగా డబ్బు ఇచ్చి హంగూ ఆర్భాటాలతో ప్రచారం చేసుకున్నంత మాత్రాన పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చే అవకాశం లేదన్నారు. కమీషన్ల కోసం వారిని వేధించకుండా అనుమతులు ఇస్తేనే ఏదైనా సాధ్యమన్నారు. ఈ మధ్యనే రాష్ట్రానికి విచ్చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్రానికి రూ. 3 లక్షల కోట్లు సాయం అందించామని చెప్పారని, కూటమి ప్రభుత్వం ఈ ఏడు నెలల్లో లక్ష కోట్ల మేర అప్పు చేసిందని.. అలాంటప్పుడు కేంద్రం ఇచ్చిన నిధులు ఏమయ్యాయో రాష్ట్ర ప్రజలందరికీ ప్రభుత్వం తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సౌమిత్రి, జగదీశ్వర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, హరిబాబు, మణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

ఏప్రిల్‌లో తరగతులు షురూ!

- మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి అడుగులు
- తుది పరిశీలనకు వచ్చిన తనిఖీ బృందం
- ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం

మదనపల్లె: విద్యానగరిగా పేరొందిన మదనపల్లెలో మరో విద్యాలయం ఏర్పాటుకానుంది. స్థానిక ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి అడుగులు శరవేగంగా పడుతున్నాయి. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కృషితో మదనపల్లెకు మంజూరైన కేంద్రీయ విద్యాలయం ఏప్రిల్‌లో విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. మంగళవారం కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్)కు చెందిన తనిఖీ బృందం మదనపల్లెలో తుది పరిశీలనకు వచ్చింది. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి మండలంలోని వలసపల్లె పంచాయతీలో కేంద్రీయ విద్యాలయానికి, నేషనల్ హైవేకు ఆనుకుని వివిధ సర్వేనెంబర్లలో కేటాయించిన 6.09 ఎకరాల స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించేందుకు తాత్కాలికంగా నిర్మించిన తరగతి గదులను, వసతులను పరిశీలించారు. విద్యార్థులకు, బోధనా సిబ్బందికి చేయాల్సిన ఏర్పాట్లపై రెవెన్యూ అధికారులకు పలు సూచనలిచ్చారు. ప్రస్తుతం ఉన్నటువంటి టాయిలెట్స్‌కు అదనంగా మరికొన్ని నిర్మించాలన్నారు. స్టాఫ్‌కు సంబంధించి ఆఫీసు గది ఏర్పాటు, పిల్లలకు గ్రౌండ్, నీటివసతి తదితరాలపై ఆరా తీశారు. అనంతరం కేంద్రీయ విద్యాలయ సంఘటన్, కడప ప్రిన్సిపాల్ మునేష్‌మీనా మాట్లాడుతూ... మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లకు సంబంధించి తుది పరిశీలనకు వచ్చామన్నారు. కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి ప్రభుత్వం కేటాయించిన స్థలం, తాత్కాలిక తరగతి గదులు అనుకూలంగా ఉన్నాయని, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలనలో తాము గమనించిన అంశాలపై నివేదిక పంపుతామని, ఏప్రిల్‌లో 1 నుంచి 5వ తరగతి వరకు, ఒక్కో తరగతికి 40 మంది విద్యార్థుల చొప్పున క్లాసులు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ...ఏప్రిల్ నుంచి తాత్కాలిక భవనంలో కేంద్రీయ విద్యాలయం తరగతులు ప్రారంభమవుతాయని, మూడేళ్లలోపు వలసపల్లెలో పూర్తి స్థాయిలో భవన నిర్మాణం జరిగాక అక్కడకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ టీచర్ విజయకుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, సర్వేయర్ రెడ్డిశేఖర్, గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



తాత్కాలిక భవనంలో తరగతి గదులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ మునేష్‌మీనా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ఫలించిన ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయం మంజూరులో ఎంపీ మిథున్‌రెడ్డి కృషి ఎనలేనిది. మదనపల్లెను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఆయన బీటీ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడంతో పాటుగా బీటీ యూనివర్శిటీ ఏర్పాటుకు జీఓ విడుదల చేయించారు. అలాగే రాజంపేట పార్లమెంటరీకి మంజూరైన మెడికల్ కళాశాలను ఆరోగ్యవరం సమీపంలో 95 ఎకరాల సువిశాల స్థలంలో రూ.495 కోట్లతో ఏర్పాటయ్యేందుకు చొరవచూపారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి పలుమార్లు కేంద్రమంత్రులను కలిసి కల సాకారమయ్యేలా కృషిచేశారు. రానున్న విద్యాసంవత్సరానికి కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంపై పట్టణవాసులు ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

అత్యాచారం ఘటనపై డీఎస్పీ విచారణ

రాయచోటి : రాయచోటిలో 16 ఏళ్ల బాలికపై జరిగిన అత్యాచార సంఘటనపై డీఎస్పీ కృష్ణ మోహన్ విచారణ సాగిస్తున్నారు. బాలికపై జరిగిన అత్యాచార సంఘటనపై రాయచోటి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసు విషయంపై మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, కడప రిమ్స్ ఆసుపత్రిలో డీఎస్పీ విచారణ చేశారు. హెచ్ఐవీ బాధితురాలిగా ఉన్న ఆ చిన్నారికి అందుతున్న వైద్యం, బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ల్యాబ్ టెక్నీషియన్ టి.విజయ్‌కుమార్ విధి నిర్వహణపై ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో కలిసి ఆరా తీసినట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం



అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలో ఏడు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 99 మద్యం బాటిళ్లను కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు మంగళవారం ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యానికి సంబంధించి దొరికిన మద్యాన్ని పుట్లంపల్లి చెరువులో ధ్వంసం చేశామన్నారు.

మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్‌లో రేపు వేలం పాట

రాయచోటి జగదాంబసెంటర్ : మదనపల్లెలోని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎస్‌బీసీఎల్)లో ఈ నెల 23వ తేదీన బహిరంగవేలం పాట నిర్వహించనున్నట్లు ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో ఫ్రీజర్స్ 65, ఇన్వర్టర్ విత్ బ్యాటరీ 67, క్యాష్ చెస్ట్ 44, స్కానర్స్ 240, క్యాష్ కౌంటింగ్ మెషిన్లు 83 ఉన్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు డిపో మేనేజర్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో, మదనపల్లె కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రాజకీయ కక్ష సాధింపుతో
దుకాణం గదులు కూల్చివేత



జేసీబీ సాయంతో నేలమట్టం చేసిన దుకాణం గది



శిథిలాల మధ్య బాధితుడు వై.గణేష్ కుమార్ రెడ్డి

- రూ. 6 లక్షల మేర ఆస్తి నష్టం
- సామగ్రిని తీసుకుంటామన్నా వినని అధికారులు
- అధికార పార్టీ తీరుపై ప్రజల్లో వ్యతిరేకత

రాయచోటి (రామాపురం) : ఎన్నికల్లో వ్యతిరేకంగా పనిచేశారన్న రాజకీయ కక్ష, అధికార దర్పంతో చిల్లరకొట్టు దుకాణం గదులను జేసీబీ సాయంతో నేలమట్టం చేశారు. గదులలో విక్రయానికి నిల్వ ఉంచిన సామగ్రిని బయటకు తీసుకుంటామన్నా వినకుండా గదులను నేలమట్టం చేసి తమ రాజకీయ పగను, ప్రతీకారాన్ని తీర్చుకున్నట్లు స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం రహదారి స్థలంలో గదిని నిర్మించారన్న నెపంతో అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన మండల అధికారులు, పోలీసులు దగ్గరుండి ఈ విధ్వంసాన్ని పూర్తి చేయించారు. మంగళవారం మధ్యాహ్నం జరిగిన అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాన్ని మండల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రామాపురం మండలం రాచపల్లి పంచాయతీలోని సచివాలయం, పాఠశాల సమీపంలో స్థానికంగా ఉన్న ఎలగపల్లి గణేష్ కుమార్ రెడ్డి ఉపాధి కోసం చిల్లర దుకాణాన్ని నడుపుకుంటున్నారు. దుకాణం వెనుక వైపున సర్వే నంబర్. 461లో తన తాత పేరున ఉన్న భూమిని పాఠశాల నిర్మాణానికి ఇచ్చారు. ఆ పాఠశాల ప్రాంగణం ముందు భాగంలో రహదారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రేకులతో ఏర్పాటు చేసుకున్న చిన్న గదుల్లో చిల్లర దుకాణాన్ని నడుపుకుంటున్నారు. ఇటీవలి ఎన్నికల్లో గణేష్ కుమార్ రెడ్డి వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న కక్షతో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు నియోజకవర్గ ప్రధాన నాయకుడి దృష్టికి తీసుకెళ్లి దుకాణాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం విలువైన భూమిని పాఠశాలకు కేటాయించిన వారిపై రాజకీయ కక్ష సాధింపు చేయడం తగదని స్థానికంగా ఉన్న కొంతమంది పెద్దలు చెప్పడంతో అధికారులు ఆలోచనలో పడ్డారు. అయితే రాజకీయ అధినేత నుంచి అధికారులపై ఒత్తిడి తెచ్చి పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన వారిపై చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో పార్టీకి ఇబ్బందులు ఉంటాయని నిర్మాణాలను తొలగింప చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

తహసీల్దార్, ఎస్ఐల సమక్షంలోనే..

రహదారికి ఇబ్బందిగా ఉందన్న నెపంతో రామాపురం ఎస్ఐల సమక్షంలోనే దుకాణం గదులను నేలకూల్చారు. దుకాణంలో ఉన్న అంగడి సరుకులను బయటకు తీసుకుంటామని అంగడి యజమాని గణేష్ కుమార్ రెడ్డి అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో దుకాణంలోని రూ. 3 లక్షలు విలువజేసే సరుకులు దుమ్ముపట్టాయి. రూ. 3 లక్షలతో నిర్మించిన గది నేలపాలైంది. ఫలితంగా ఆరు లక్షల రూపాయల మేర ఆస్తి నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని గణేష్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు వేర్వేరు ప్రాంతాల్లో చోరీ

సిద్దవటం : మండలంలోని నిర్మలగిరి కాలనీలో వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు జరిగాయి. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప-చెన్నై జాతీయ రహదారి ఆనుకొని ఉన్న కిరాణాషాపులో, నిర్మలగిరి ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న సుబ్బమ్మ గృహంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. సుబ్బమ్మ సోమవారం రాత్రి తన ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తన కుమారుడి ఇంటికివెళ్లి అక్కడ పడుకుంది. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికే బీగాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న రూ. 8వేలు పొదుపు డబ్బులను దొంగిలించి దుస్తులు చిందర వందర చేసి ఉన్నారు. కిరాణాషాపు యజమాని నరసయ్య మాట్లాడుతూ తన కిరాణా షాపునకు ఉన్న రెండు తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రూ. 4వేలు నగదు, కొన్ని వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని తెలిపారు. ఈ విషయమై స్థానిక ఏఎస్ఐ సుబ్బరామచంద్రను వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాలకు వెళ్లి జరిగిన సంఘటనపై విచారిస్తున్నామని చెప్పారు.



నిర్మలగిరి కాలనీలో సుబ్బమ్మ ఇంటిలోని బీరువా తాళాలు పగులగొట్టిన దృశ్యం

బహిరంగంగా మద్యం తాగిన వారిపై కేసు నమోదు

మదనపల్లె : బహిరంగంగా మద్యం తాగుతున్న పదిమందిపై కేసులు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మంగళవారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా, చిప్పిలి అమూల్ డెయిరీ తదితర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు బహిరంగంగా మద్యం తాగుతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 55 మందికి జరిమానా విధించినట్లు చెప్పారు.

బంగారం తీసుకొని మోసం చేశాడంటూ ఫిర్యాదు

వీరబల్లి : బంగారం తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడంటూ ఓ వ్యక్తిపై బాధితురాలు ఫిర్యాదు చేసింది. వీరబల్లి మండలం పెద్దవీడు పంచాయతీ రూకావాళ్లపల్లికి చెందిన రూకా కృష్ణారెడ్డి కుమార్తె నవదీపిక వద్ద రాయచోటి మాధవరానికి చెందిన శ్రీధర్ అనే వ్యక్తి ఎనిమిది తులాల బంగారు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో బాధితురాలు వీరబల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ మోహన్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మదనపల్లెలో కదిరి వాసి మృతి



సాదిక్‌అలీ (ఫైల్)

మదనపల్లె : కదిరికి చెందిన వ్యక్తి మదనపల్లెలో మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. కదిరి పట్టణం నానాదర్గా వీధికి చెందిన సాబ్‌జాన్ కుమారుడు సాదిక్‌వలీ(49) మూడు రోజుల క్రితం మదనపల్లె దక్నీపేటలోని బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం రాత్రి బసినికొండ ఉరుసులో భాగంగా గంధం ఊరేగింపు బెంగళూరు బస్టాండ్‌కు రాగా, చూసేందుకు సాదిక్‌వలీ బస్టాండ్‌లోకి వచ్చాడు. అంతలోనే ఉన్నట్లుండి కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న మృతుడి బంధువులు గత కొంతకాలంగా సాదిక్‌వలీ అనారోగ్యంతో బాధపడుతున్నారని, పరిస్థితి విషమించి మృతి చెంది ఉండవచ్చని పోలీసులకు తెలిపారు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని శెట్టిగుంట గ్రామానికి చెందిన ఇరువూరి గంగయ్య (37) మంగళవారం యానాది కాలనీ వద్ద తన సొంత ఆటోలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు సీఐ హేమసుందర్‌రావు తెలిపారు. మృతుడికి భార్య రసూలమ్మ, కుమార్తె ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

సిద్దవటం : టక్కోలు పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. మండలంలోని టక్కోలు పెన్నానది నుంచి టక్కోలు, మంగనవాండ్లపల్లె గ్రామాలకు చెందిన ట్రాక్టర్లు అక్రమంగా కడపకు ఇసుక తరలిస్తుండటంతో టక్కోలు బండికనుమ వద్ద వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనాలకు జరిమానా విధించాలని సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవీలతకు అప్పజెప్పామన్నారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ ప్రమాదంలో మరొకరి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని రామాంజనేయపురం ఆచార్ల కాలనీలో జరిగిన సెప్టిక్ ట్యాంక్ ప్రమాద ఘటనలో బిక్కిరి అరుణ్‌కుమార్(39) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. సోమవారం సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా ముగ్గురు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వారిని ఆసుపత్రికి తరలించగా నాగయ్య అనే వ్యక్తి మృతి చెందిన విషయం విదితమే. ఈ సంఘటనలో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బిక్కిరి అరుణ్‌కుమార్ (39) మంగళవారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య రెండుకు చేరింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించామని రిమ్స్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని చూసి వారి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

విడాకులు తీసుకున్నా వేధిస్తున్నాడని కేసు నమోదు

చాపాడు : మండలంలోని చిన్నవరదాయపల్లెకు చెందిన బొబ్బూరి నాగార్జున అనే వ్యక్తి ఏడాది క్రితం తనతో విడాకులు తీసుకున్నా తనను వేధిస్తున్నాడని మాజీ భార్య లీలావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. 20 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్న నాగార్జున, లీలావతి 2024లో మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకున్నారు. అయితే గత ఏడాది నుంచి లీలావతి పేరుతో ఉన్న భూమి, ఇల్లు రాసివ్వాలని విడాకులు తీసుకున్న భర్త రోజూ వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

నల్లరాళ్లమిట్టలో దొంగతనం



బీరువా తెరిచి ఉన్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం రాఘవరాజుపురం పంచాయతీ, నల్లరాళ్లమిట్టలో నివాసం ఉంటున్న బనగానపల్లి రామ్మోహన్ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని ఎనిమిది తులాల బంగారు, రూ. 30 వేలు నగదును దోచుకెళ్లారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సీఐ హేమసుందర్ రావు, ఎస్ఐ నవీన్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్‌ను రప్పించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామన్నారు.

వృద్ధుడి అదృశ్యం



రామక్రిష్ణారెడ్డి(ఫైల్)

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎన్.పాలగిరి గ్రామానికి చెందిన మల్లంగి రామక్రిష్ణారెడ్డి(70) ఈ నెల 14వ తేదీ నుంచి కనిపించడంలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఆచూకీ కోసం బంధువుల ఇళ్లతో పాటు పలు ప్రాంతాల్లో వారం రోజులుగా గాలించినా ఫలితం లేదన్నారు. 18వ తేదీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9398143149, 9292109219 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

బసిరెడ్డిపల్లె ఉపాధ్యాయుడి సస్పెన్షన్

చాపాడు : మండల పరిధిలోని బసిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న వైవీ ప్రతాప్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యా శాఖాధికారి ఉత్తర్వులు విడుదల చేశారని ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. పాఠశాలకు సరిగా హాజరుకాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, రికార్డ్స్ సక్రమంగా నిర్వహించకపోవడం, విద్యార్థులకు చదువు చెప్పకపోవడం, పరీక్ష పత్రాలు దిద్దకపోవడం తదితర కారణాల వలన ప్రతాప్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

ఏకశిలానగరి బ్రహ్మోత్సవాల తేదీ ఖరారు

- ఏప్రిల్ 6న శ్రీరామనవమి, పోతన జయంతి
- ఏప్రిల్ 11న సీతారాముల కల్యాణం



ఒంటిమిట్ట సీతారామలక్ష్మణ మూర్తులు

ఒంటిమిట్ట : ఏకశిలానగరిలో కొలువైన కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ తేదీలను టీటీడీ ఖరారు చేసినట్లు మంగళవారం ఒంటిమిట్ట ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5న సాయంత్రం 4 గంటలకు మూలమూర్తులకు వ్యాసాభిషేకం చేసి, అదే రోజు సాయంత్రం 6 నుంచి 10 గంటల మధ్య ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 6న ఉదయం తొమ్మిది గంటలకు ధ్వజారోహణం చేస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు బమ్మెర పోతన జయంతి కార్యక్రమంతో పాటు కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 11న రాత్రి 7 నుంచి 8 గంటలకు కాంత కోరిక ఎదుర్కోలు అనంతరం రాత్రి 8 నుంచి 10 గంటల వరకు సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 12న రథోత్సవం, 14న చక్రస్నానం, 15న సాయంత్రం పుష్పయాగం, అదే రోజు రాత్రి ఏకాంత సేవతో ఉత్సవాలు ముగియనున్నట్లు వివరించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటలకు, రాత్రి 8 నుంచి 10 గంటలకు వాహన సేవ ఉంటుందన్నారు. అలాగే ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీ



గుర్రంకొండ బస్టాండులోని జనరల్ స్టోర్‌లు తనిఖీ చేస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గుర్రంకొండ బస్టాండులోని పలు దుకాణాల్లో కాలం చెల్లిన తినుబండారాలను దుకాణదారులు విక్రయిస్తున్నారంటూ జిల్లా కలెక్టర్‌కు గత సోమవారం స్పందన కార్యక్రమంలో కొంతమంది ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి సలీమ్‌బాషా ఆధ్వర్యంలోని అధికారుల బృందం స్థానిక బస్టాండులోని జనరల్ స్టోర్‌లు తనిఖీ చేశారు. సదరు దుకాణంలో కాలం చెల్లిన తినుబండాలు ఉండడంతో వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా బస్టాండులో పలు మాంసం దుకాణాల్లో కల్తీ జరుగుతోందని, శుచి శుభ్రం లేని మాంసాన్ని విక్రయిస్తున్నారని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై కూడా విచారణ జరిపి చర్యలు చేపట్టాలని వారు కోరారు.

అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

సుండుపల్లె : పశువులను నిర్బంధించి అక్రమంగా తరలిస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వినుకొండ నుంచి కలికిరికి పశువులతో బయలుదేరిన లారీని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో 28 పశువులను నిర్బంధించి అక్రమంగా తరలిస్తుండటంతో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు లారీని, అందులోని 19 ఎనుములు, 9 ఎద్దులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ అక్రమ రవాణాకు సంబంధించి ముగ్గురు నిందితులతో పాటు సహకరించిన వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పశువులను కోర్టు ఆదేశం మేరకు గోశాలకు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

నేడు ఒంటిగారి రామసుబ్బన్న 25వ వర్ధంతి



ఒ.రామసుబ్బన్న (ఫైల్)

వీరపునాయునిపల్లె : మండలానికి చెందిన విద్యావేత్త ఒంటిగారి రామసుబ్బన్న 25వ వర్ధంతిని బుధవారం నిర్వహించనున్నారు. రామసుబ్బన్న 1941లో పులివెందుల తాలూకా మల్లేల గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో అన్‌ట్రైన్డ్ టీచర్‌గా చేరారు. 1942–44లో కడప పట్టణంలోని లండన్ మిషన్ ట్రైనింగ్ స్కూల్‌లో హయ్యర్ గ్రేడ్ శిక్షణ పూర్తి చేసి హయ్యర్ గ్రేడ్ టీచర్‌గా స్థిరపడ్డారు. ఆ తర్వాత 1947 ఆగష్టు 4వ తేదీన వీరపునాయునిపల్లెలో హిందూ ఎయిడెడ్ పాఠశాలలో మూడవ ఉపాధ్యాయుడిగా చేరారు. ఆయన సేవలను గుర్తించిన యాజమాన్యం వారు పాఠశాలను రామసుబ్బన్నకు అప్పగించారు. తరువాత పాఠశాలకు నేతాజీ ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలగా నామకరణం చేశారు. అప్పటి నుంచి ఉపాధ్యాయుడిగా, పాఠశాల మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1952లో ఎలిమెంటరీ పాఠశాలను హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలగా మార్పు చేశారు. 1953లో సీనియర్ బేసిక్ పాఠశాల, 1964లో సంగమేశ్వర ఉన్నత పాఠశాలగా మార్చారు. విద్యా రంగానికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1968లో అప్పటి రాష్ట్రపతి వి.వి.గిరి గారి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు ప్రదానం చేసింది. రామసుబ్బన్న 1973లో జూనియర్ కళాశాల, 1980లో వీఆర్‌యస్ డిగ్రీ కళాశాల, 1994లో పీజీ (తెలుగు) కోర్సును ప్రారంభించారు. ఆధ్యాత్మికత సేవలో భాగంగా వీరపునాయునిపల్లెలో ఆంజనేయ స్వామి దేవాలయం, కీర్తిపల్లెలో చెక్ డ్యామ్ నిర్మాణంతో పాటు సంగమేశ్వరాలయం అభివృద్ధికి కృషి చేశారు. సంగమేశ్వర విద్యా సంస్థల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు ఎంతోమంది నేడు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారు.

భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంట్



మేస్త్రీలకు బీమా పత్రాలను అందిస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

బ్రహ్మంగారిమఠం : అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకు భారతి సిమెంట్ ప్రతిష్టమైందని భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజినీర్లు చిన్న శ్రీకాంత్‌రెడ్డి, నాగేంద్ర, సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర ట్రేడర్స్ సమీపంలో బిల్డర్లు, మేస్త్రీలకు సిమెంట్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతోందన్నారు. అల్ట్రాఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఇతర కంపెనీల సిమెంట్ ఐదు గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రా ఫాస్ట్ రెండు గంటల్లోనే సెట్ అవుతుందన్నారు. చాలా దృఢత్వాన్ని కలిగి, కట్టడాలు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. అనంతరం 60 మంది మేస్త్రీలకు రూ.లక్ష ఉచిత బీమా బాండ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : సకాలంలో పన్ను చెల్లించాలని నెల్లూరు సర్కిల్–1 ఇన్‌కంటాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.శరత్‌బాబు పేర్కొన్నారు. స్థానిక వసంతపేటలోని బుశెట్టి కళ్యాణ మండపంలో వాణిజ్య సంఘాలు, ఆదాయ పన్ను చెల్లింపుదారుల సంఘాలకు వివాద్ సే విశ్వాస్ పథకం, అడ్వాన్స్ టాక్స్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ వివాద్ సే విశ్వాస్ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. పన్ను చెల్లింపుదారులు ఈ నెల 31వ తేదీ లోగా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకం వల్ల ఆదాయపు పన్నుకు చెందిన వడ్డీలు, పెనాల్టీలు, శిక్షలు మాఫీ అవుతాయన్నారు. అడ్వాన్స్ టాక్స్ పన్ను చెల్లింపుదారులు వారి వార్షిక ఆదాయంపై చెల్లించాల్సిన ఆదాయం పన్ను నాలుగు విడతల్లో చెల్లించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ పి.వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ కె.శశివర్ధన్, టాక్స్‌బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా, ఉపాధ్యక్షుడు మేడా చంద్రశేఖర్, కడప చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు సాధు గోపాల కృష్ణ, ఇన్‌కంటాక్స్ కార్యాలయ సిబ్బంది, పన్ను చెల్లింపుదారులు పాల్గొన్నారు.

ఎద్దుల బండి ఢీ కొని మహిళ మృతి



మృతి చెందిన రంగమ్మ

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని సాయినగర్‌లో ఎద్దుల బండి ఢీ కొన్న ఘటనలో రంగమ్మ (50) అనే మహిళ మృతి చెందింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రంగమ్మ తన ఇంటి సమీపంలో ప్రతి రోజు వాకింగ్‌కు వెళ్లేది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వాకింగ్ చేసేందుకు వీధిలోని మహిళలతో కలిసి బయటికి వెళ్లింది. అదే సమయంలో ఇసుక లోడ్‌తో ఎడ్లబండి వాళ్ల ఎదురుగా వచ్చింది. అయితే ఎద్దులు ఒక్కసారిగా బెదురుకొని పరుగెత్తడంతో బండి ఢీ కొని ఆమె కింద పడిపోయింది. బండి టైర్ రంగమ్మ మీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. మృతురాలు రంగమ్మకు నరసింహులు, హరి అనే ఇద్దరు కుమారులతో పాటు నరసమ్మ అనే కుమార్తె ఉన్నారు. రూరల్ ఎస్ఐ సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుమారుడు హరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.